

మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

ఉద్యమకారులను ఆదుకోవాలి

ఎర్రగడ్డ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలో ఉద్యమకారులు సర్వం కోల్పోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకులు మంత్రి దామోదరం రాజనర్సింహను కోరారు. ఈ మేరకు వారు ఆదివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ. 25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రకటన చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడు ఇంద్రకుమార్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ బి.చంద్రశేఖర్, నాయకులు ఎస్.కుమారస్వామి, కే.సురేందర్, వినోద్‌కుమార్, జగన్, మాణిక్యం తదితరులు ఉన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బండి రమేష్, విశాల్ సుధాం తదితరులు

ప్రకాశ్‌నగర్‌లో ఇఫ్తార్ విందు

బేగంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో పర్వేజ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీక అని, అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సలీంఖాన్, విశాల్ సుధాం, రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినాయక్‌నగర్ వాసుల విజ్ఞప్తి

బోరబండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ వినాయక్‌నగర్‌లో రహదారి సదుపాయం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొండ ప్రాంతమైన ఈ బస్తీలో కొన్ని వీధులు రాకపోకలకు అనువుగా లేవు. దీంతో బస్తీ చర్చి వీధిలో స్థానికులే మెట్లు నిర్మించుకున్నారు. అయితే మెట్లమార్గంలో ప్రయాణించడం కష్టంగా ఉందని, చిన్నపిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారని బస్తీవాసులు గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐదేళ్ల క్రితం సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.3.3లక్షలు మంజూరయ్యాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అప్పట్లో ఈ పనులను ప్రారంభించారు. అయితే అప్పటి కార్పొరేటర్ ఎంఏ షఫీ, ఎమ్మెల్యేకు మధ్య విభేదాలు రావడం, బస్తీ అధ్యక్షుడిగా కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తి ఉండటంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రోడ్డు పనులకు మంజూరైన నిధులను అధికారులు ఇతర పనులకు మళ్లించారు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సీసీ రోడ్డు నిర్మించాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్

బోరబండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారానగర్‌లో వి.సరళ, బోరబండ బస్టాప్ వద్ద వినాయకరావునగర్‌లో మేరీ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వీరిని పోలీసులు అరెస్టు చేశారు. సరళ వద్ద 44 మద్యం సీసాలు లభించగా, మేరీ వద్ద సగం ఖాళీ అయిన 3 మద్యం సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో గంజాయి విక్రయించే ముఠా

ఆరుగురు గంజాయి విక్రయదారుల అరెస్ట్

ఖైరతాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెద్ద మొత్తంలో గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న కవర్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్న ఆరుగురు యువకుల ముఠాను ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్ వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్న పోలీస్ సిబ్బందిని చూసి ఆరుగురు యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీరు చిక్కడపల్లిలో గంజాయి కొనుగోలు చేసి నగరంలోని పలు వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు నిందితులు 30 ఏళ్ల లోపు వయస్సు వారేనని.. ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూనే గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 1182 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ననుబాల సురేష్ (23), హెల్పల్ భానుచందర్ (22), శీలం ప్రణయ్ కుమార్ (25), పాశుల నితిన్ (24) పాత నిందితులు కాగా, మరో ఇద్దరిని కాశీ రాహుల్(26), డోలా డేవిడ్ (24)గా గుర్తించారు. ముగ్గురు చిక్కడపల్లిలోని ఓ గదిలో ఉంటుండగా, మిగతా వారు కేపీహెచ్‌బీలో ఉంటున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



అమీర్‌పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందర్‌నగర్ కాలనీలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుంది. అతడు స్థానికంగా భిక్షాటన చేస్తు రాత్రి వేళ ఫుట్‌పాత్‌పై నిద్రించేవాడని స్థానికులు తెలిపారు. అతడు ఆదివారం ఉదయం నిద్ర లేవకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

15 రోజులు.. రూ.83 కోట్లు

- ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్య సాధనపై అధికారుల దృష్టి
- ఓటీఎస్‌లో భాగంగా వడ్డీపై 90 శాతం రాయితీ
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న ఉప కమిషనర్లు

ఖైరతాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను చెల్లింపు కోసం జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) విధానాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా చెల్లించాల్సిన బకాయిలపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జంట సర్కిళ్లలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 15 రోజులు సమయం ఉండగా.. రూ.83 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు సర్కిళ్ల ఉపకమిషనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు టార్గెట్లు విధించి వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు.

సర్కిళ్ల వారీగా వసూళ్ల లక్ష్యం ఇలా..

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖైరతాబాద్ సర్కిల్(17) పరిధిలో రూ.164 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ.114.21 కోట్లు వసూలు చేశారు. మరో 15 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లు లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ (18) పరిధిలో ఈ ఏడాది 187 కోట్ల రూపాయల వసూళ్ల లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 154.41 కోట్ల రూపాయలు వసూలు చేశారు. మిగతా రూ.33 కోట్లతో పాటు ఈసారి టార్గెట్ కంటే ఎక్కువగా పన్ను వసూలు చేయాలని సర్కిల్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత సంవత్సరం ఈ సర్కిల్‌లో రూ.184 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఉప కమిషనర్ ప్రశాంతి ప్రత్యేక చొరవతో వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంను సద్వినియోగం చేసుకునేలా బస్తీలు, కాలనీల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు ఆస్తిపన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. మరోవైపు పెద్ద మొత్తంలో పన్ను బకాయి ఉన్న వారి ఆస్తులను సీజ్ చేస్తూ అధికారులు దూకుడు ప్రదర్శిస్తుండడంతో ఇక్కడ టార్గెట్‌ను సులువుగా సాధిస్తారనే నమ్మకం కలుగుతోంది.



ఖైరతాబాద్ సర్కిల్‌లో ఆస్తిపన్ను పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో ఓటీఎస్‌కు అవకాశం వచ్చింది. మార్చి 31 వరకు పన్ను బకాయి ఉన్న ప్రతి ఒక్కరూ వడ్డీపై 90 శాతం రాయితీతో చెల్లించొచ్చు. దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 తర్వాత ఎలాంటి రాయితీ ఉండకపోగా మరింత వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆస్తి పన్ను చెల్లించాలి.

- ప్రశాంతి, ఉపకమిషనర్, జీహెచ్ఎంసీ సర్కిల్ 18



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

చలివేంద్రం ప్రారంభం

అమీర్‌పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు బల్కంపేట ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో చెలిమెల రవికిరణ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం బీజేఆర్ నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగంగా రవికిరణ్ ప్రతి వేసవిలో పరిశుభ్రమైన తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హన్మంతరావు, పోతరాజు కుమార్, వనం శ్రీనివాస్, పృథ్వీరాజ్, కట్టా బలరాం, శ్రీలక్ష్మి, చలిమెల శివశంకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

అమీర్‌పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో నిర్వాహణతో పాటు తమ ఆరోగ్యం విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్‌కు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదివారం బీకేగూడలోని శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు వైద్య పరిక్షల పరికరాలు, మందులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. తమ వయసును సైతం లెక్క చేయకుండా అనేక సేవా కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ప్రశంసించారు. ప్రతి సంవత్సరం వేసవిలో అన్నదానం చేస్తూ వేలాదిమంది ఆకలి తీరుస్తున్నారని, ఉచిత వైద్య శిబిరాల నిర్వాహణ, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి యాజమాన్యం శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్‌కు తలసాని చేతుల మీదుగా సీఎస్ఆర్ ఫండ్ కింద రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, కొలను బాల్‌రెడ్డి, ట్రస్ట్ ట్రస్టీ పార్థసారధి, మాణిక్ రావ్ పాటిల్, ఆస్పత్రి ప్రతినిధులు, డాక్టర్లు సుష్మ, రవి శంకర్, అనంత రెడ్డి, కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



కానుకలు అందించిన హబీబాసుల్తానా

సెహరీకి సహకరించిన వారికి కానుకల ప్రదానం

బోరబండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా బోరబండ కార్పొరేటర్ ఎండీ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెహరీ కార్యక్రమానికి సహకరించిన వారికి ఆయన సతీమణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త బాబా ఫసియుద్దీన్ దశాబ్దకాలంగా సెహరీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రతిరోజూ 500 మందికి భోజనం పెట్టడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. సెహరీ కార్యక్రమంలో ప్రత్యేకంగా గంగా-జమున తహెజిబ్ ఉట్టిపడే విధంగా హిందూ-ముస్లిం, ఇతర మతాల సోదరులు పాల్గొనడం అభినందనీయమని, తద్వారా అందరికీ ఆదర్శంగా ఉండటం గర్వంగా ఉందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శిల్పారామంలో ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, సంగీత కచేరి అలరించాయి. చెన్నై నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి కుమారి వర్షరాజ్ కుమార్ తన ప్రదర్శనతో మెప్పించారు. స్నేహ రాంచందర్ శిష్య బృందం సంగీత కచేరీలో ఏకదంతం వినాయక, నమో శారదా, రామ రామ, శంకర పూజితే, ఎందుకయ్యా సాంబశివ, అంబుజవాసిని తదితర పాటలను దివ్య, అనన్య, లహరి, హితేష్ ఆలపించారు. నాట్య గురువులు పద్మ, నిరంజన్ కళాకారులను అభినందించారు.

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

- ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు వెంటనే సొంత భవనాలను నిర్మించకుంటే ప్రగతి భవన్, మినిస్టర్ క్వార్టర్స్, ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు హాస్టల్ విద్యార్థులను తరలిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం అంగుళం భూమి అమ్మినా ఉపేక్షించేది లేదన్నారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం, తెలంగాణ యువజన విభాగం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్, గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేలా తాను కృషి చేస్తామన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్, గురుకులాల భవనాలకు అద్దెలు చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించాలే తప్ప వాటిని విక్రయించే హక్కు ఎవరికీ లేదన్నారు. భూముల అమ్మకంపై నిర్ణయాన్ని మార్చుకోకుంటే పార్లమెంటులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, అనంతయ్య, మల్లేష్, రవి కుమార్, మణికంఠ, నిఖిల్, ఆశిష్‌గౌడ్, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల నాయకులు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

యూసుఫ్‌గూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో శ్రీకృష్ణానగర్ మున్నూర్ కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మామిడాల రాజు, అధ్యక్షుడిగా బుడుగు రవీందర్, ఉపాధ్యాక్షుడిగా వాసాల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా అమృత సత్యం, కోశాధికారిగా భక్తుల సురేష్ ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోళ్ల శివకుమార్, పెరిక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చే 'దావత్ ఏ ఇఫ్తార్'ను రద్దు చేయాలి

- విందుకు ఖర్చు చేసే నిధులను ముస్లింల సంక్షేమానికి వినియోగించాలి
- సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డా. లుబ్నా సర్వత్

పంజాగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో హంగు, ఆర్భాటలతో నిర్వహించే దావత్ ఏ ఇఫ్తార్ విందును రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ లుబ్నా సర్వత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ వర్గాలకు చెందిన వారు పాల్గొని మాట్లాడారు. రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందుతో సుమారు రూ.70 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని లుబ్నా సర్వత్ అన్నారు. ఈ నిధులను మైనారిటీల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని ఆమె కోరారు. రంజాన్ మాసంలో ప్రార్థనల తరువాత రోజా విడిచే సమయంలో ఎవరి ఇంట్లో వారు పండ్లు తీసుకుంటారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన పద్ధతిని ప్రస్తుత ప్రభుత్వం అనుసరించవద్దని సూచించారు. ప్రజాధాన్ని వృథా చేయకుండా మైనార్టీల స్టడీ సర్కిల్, సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్, ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ మైనార్టీస్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ మాసంలో ఒక్కో మసీదుకు లక్ష రూపాయలు ఇస్తున్నారని, వాటికి లెక్కలు సైతం ఉండడం లేదని, ఆ డబ్బును ముస్లింల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని ఆమె సూచించారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశానని, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లకు సైతం లేఖలు రాయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, అయేషా ఫాతిమా, ఖుద్సియా తబస్సుమ్, ఇస్మాయిల్, విజయ భాస్కర్, నదీమ్ అఖిక్, మీర్జా మౌలానా హుస్సేన్, అన్వర్ పటేల్, ప్రకాష్, అంతర్వేది, వెంకటేష్, అజ్మత్ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లుబ్నా సర్వత్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

గ్రంథాల ఆవిష్కరణ

అమీర్‌పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విశ్వనాథ సాహిత్య పీఠం పక్షాన వెలిచాల కొండలరావు రచించిన 8 గ్రంథాలను ఆదివారం అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత పాఠశాలలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్లు హరగోపాల్, యాదగిరి, రామరెడ్డి, నర్సింగరావు, వంగపల్లి విశ్వనాథం, నలిమెళ్ల భాస్కర్ ఆవిష్కరించారు. మా కాలపు మానవుని సందిగ్ధావస్థ అనే పుస్తకాన్ని ఆవిష్కరించి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. డాక్టర్ హరగోపాల్ వ్యాస సంకలనాన్ని, నర్సింగరావు, నలిమేళ్ల భాస్కర్‌లు గీతాంజలి అనువాదాన్ని ప్రొఫెసర్ వీరా రెడ్డి తెలుగు నుంచి ఇంగ్లిష్ అనువాదాలను, ప్రొఫెసర్ యాదగిరి శేషేంద్ర గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హరిహర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి శనివారం రాత్రి ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో ఈ ఘటన జరిగింది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్ పైనుంచి దూకడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించగా దోమలగూడ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అతడు మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చనిపోయిన వ్యక్తి జి.రాకేష్ (43)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. రాకేష్ గత కొంతకాలంగా మానసిక ఒత్తిడితో ఇబ్బంది బాధపడుతున్నట్లు అతడి కుమార్తె హారతి తెలిపింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దళిత నేతలంటే బీఆర్ఎస్‌కు చులకన

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కాటూరి రమేష్

బంజారాహిల్స్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దళిత నేతలను బీఆర్ఎస్ఎలో మొదటి నుంచి చులకన భావనతోనే చూస్తారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కాటూరి రమేష్ అన్నారు. స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం ఫిలింనగర్‌లో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దళిత నాయకుడు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల జగదీశ్‌రెడ్డి తీరుపై ఎస్సీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పట్ల కూడా ఇలాగే ప్రవర్తించారని, లోక్‌సభ స్పీకర్ మీరాకుమారి అపాయింట్‌మెంట్ అడిగితే కేసీఆర్ కనీసం స్పందించలేదని ఆరోపించారు.

రేపు, ఎల్లుండి ఎంబీఏ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్లకు మార్చి 18, 19 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ నెల 9న నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన వారు, ఐ-సెట్ 2024-25లో అర్హత సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చన్నారు. వివరాల కోసం www.braouonline.in లేదా www.braou.ac.in వెబ్‌సైట్‌లను చూడాలని ఆయన సూచించారు.

మహిళలు ఇష్టమైన రంగాల్లో రాణించాలి

ఖైరతాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మహిళలు కుటుంబ బాధ్యతలను నెరవేరుస్తూనే, ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని డాక్టర్ అంబేడ్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ కరెస్పాండెంట్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సతీమణి గడ్డం సరోజాదేవి సూచించారు. ఆదివారం ఆదర్శ సేవా సమితి ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సరోజాదేవి వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను సత్కరించారు. జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్టు అధికారి ఎస్.లలితకుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ మాజీ ప్రత్యేక అధికారి డాక్టర్ కొర్వి వినయకల, డీఏఎల్ఈఏపీ అధ్యక్షురాలు రత్నతో పాటు పలువురిని నిర్వాహకురాలు సుదామల అంజలీకుమారి నేతృత్వంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, లావణ్య, దివ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



పద్మారావు గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు

మా హామీలపై అసెంబ్లీలో మాట్లాడండి

● ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు 'ఉద్యమకారుల ఫోరం' వినతి

రెజిమెంటల్‌బజార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాలలో తెలంగాణ ఉద్యమకారుల అంశంపై మాట్లాడాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్‌కు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసిన ఫోరం సభ్యులు గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ హామీపై అసెంబ్లీలో మాట్లాడి హామీలు అమలయ్యేలా చూడాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్, జానకి రెడ్డి, దయానంద్, ఆర్కే భూపాల్, జగన్ యాదవ్, శివకుమార్, గౌడ్ శ్రీను, టీవీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

చిలకలగూడ, మార్చి16, (ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీద బ్రాహ్మణ కుటుంబానికి నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి రాం సాయిబాబు మాట్లాడుతూ, బ్రాహ్మణ సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. పేద బ్రాహ్మణ కుటుంబాలను గుర్తించి ప్రతి నెలా వారికి విద్య, వైద్య తదితర అవసరాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వాసుదేవ రావు, కామేశ్వర రావు, శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'బోర్డు' మాజీ సభ్యుడి సతీమణి మృతి

మారేడుపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు దివంగత ఎస్.జగన్నాథం సతీమణి లింగమ్మ (90) శనివారం సాయంత్రం పికెట్‌లోని తన నివాసంలో మృతి చెందారు మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. ఆదివారం మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



లింగమ్మ (ఫైల్)

'గోమాత రక్షణే 5కే, 10కే రన్ లక్ష్యం'

రాంగోపాల్‌పేట మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, పోషకాహార నిపుణుడు, యోగా థెరపిస్ట్ వీరారెడ్డి ఆధ్వర్యంలో పీవీ మార్గ్‌లోని సంజీవయ్య పార్క్ నుంచి 5కే, 10కే రన్‌లను నిర్వహించారు. గోమాత రక్షణ, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ రన్‌లో పర్యావరణ ప్రేమికులు, ఫిట్‌నెస్ అభిమానులు, గో సంరక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్ గౌడ్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

● పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్

తార్నాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ నివాసంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ, కాలనీ వాసులు, బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్ గౌడ్, భిక్షపతి, శ్రీనివాస చారి, రాముపర్మ, అనిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

'తెలంగాణ మాంగ్ గరోడి' సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అడ్డగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి : తెలంగాణ మాంగ్ గరోడి ఎస్సీ సంక్షేమ సంఘ రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. తుకారాంగేట్‌లో జరిగిన సమావేశంలో సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశ్ కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తుకారాంగేట్ మరాఠా బస్తీకి చెందిన ఉపాదే సనాదన్, ప్రధాన కార్యదర్శి సకత్ అరుణ్ లాల్, వర్కింగ్ అధ్యక్షుడిగా కంబ్లే గోపి, అజయ్ ఉపాధ్యక్షులుగా విజయ్ గణేష్, రతిలాల్, జీత్‌లాల్, కోశాధికారిగా సంజు, సంయుక్త కార్యదర్శులుగా మహేష్, బెజు, లక్ష్మణ్ లాల్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే, కార్యదర్శులుగా రూప్‌లాల్, కుంజా, బెజు కార్యదర్శులుగా మగన్‌లాల్, గోపీచంద్, మేఘమాల, శివకుమార్ ప్రమాణం చేశారు.

ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

అడ్డగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ హామీ ఇచ్చారు. ట్యాక్సీ డ్రైవర్లు ఆదివారం ఎమ్మెల్యేను తుకారాంగేట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. తమ సమస్యలను ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జూబ్లీ బస్టాండ్ వద్ద టాక్సీ డ్రైవర్లకు కారు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

బీసీ కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలి

● ఓబీసీ సదస్సులో నేతల డిమాండ్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓబీసీ ఉద్యోగుల సదస్సు జరిగింది. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఓబీసీ ఉద్యోగులపై ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని వీహెచ్ కోరారు. జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, జనాభాలో సగ భాగం ఉన్న బీసీలు సమస్యల కోసం సంఘటితంగా ఉద్యమించాలని సూచించారు. డిమాండ్ల సాధన కోసం బీసీ, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఆలిండియా ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కరుణానిధి, రాష్ట్ర అధ్యక్షుడు దానకర్ణచారి, ప్రధాన కార్యదర్శి పాండు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అసలే రద్దీ రోడ్డు.. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు!



రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద ట్రాఫిక్‌జామ్

- బస్ స్టేషన్ నుంచి బస్సులను బయటకు తెచ్చేందుకు డ్రైవర్లకు అవస్థలు
- యూటర్న్ చేసే సమయంలో నిలిచిపోతున్న ఇతర వాహనాలు
- ట్రాఫిక్ నియంత్రణ పట్టని ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు
- రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద పరిస్థితి ఇదీ..



బయటకు వస్తున్న బస్సుకు తాకిన మరో బస్సు

రెజిమెంటల్‌బజార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రద్దీ రోడ్డు... ఉదయం నుంచి రాత్రి వరకు పలుసార్లు ట్రాఫిక్ జామ్.. వాహనాలు ముందుకు కదలకపోవడంతో స్టేషన్ నుంచి ట్రైన్ వెళ్లిపోతుందేమోనని రైల్వే ప్రయాణికుల్లో ఆందోళన.. ట్రాఫిక్‌లో త్వరగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో వాహనాలు ఢీకొని గొడవపడే డ్రైవర్లు... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డులోని రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద నిత్యం కనిపించే దృశ్యమిది. ఇక్కడి ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణం బస్ స్టేషన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా లేకపోవడమే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

231 బస్సులు... 1412 ట్రిప్పులు.. 50 వేల మంది

సికింద్రాబాద్ రేతిఫైల్ బస్ స్టేషన్‌కు నిత్యం వివిధ డిపోల బస్సులు రాకపోకలు సాగిస్తాయి. రోజుకు 231 బస్సులు 1412 ట్రిప్పులు వేస్తాయి. వీటిలో సుమారు 50 వేల మంది ప్రయాణిస్తారు. ఇంత ప్రాధాన్యత ఉన్న బస్ స్టేషన్‌లో ట్రాఫిక్ నిర్వహణ తూతూ మాత్రంగా ఉండటంతో బస్ స్టేషన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

రైట్ టర్న్ తప్పనిసరి..

రేతిఫైల్ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే ప్రతీ బస్సు స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డులో రైట్ టర్న్ తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో మెయిన్ రోడ్డులో వచ్చే ఇతర వాహనాలకు ఆటంకం ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి తోడు బస్సులు టర్న్ తీసుకొనే ప్రదేశంలో ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సదరు వాహనాలను తీసేంత వరకు బస్సులు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిత్యం పలుసార్లు ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల పై ఒత్తిడి..

బస్సులను బస్ స్టేషన్ నుంచి బయటకు తీసి ప్రధాన రోడ్డులోకి తీసుకెళ్లడం డ్రైవర్లకు నిత్యం పెద్ద సవాల్‌గా మారుతోంది. ముందుకు వెళ్తే కార్లు, ఆటోలు, బైక్‌లు, పాదచారులు... వెనక్కి తీసుకుందామంటే వెనుకనే బస్సులు, ఏ మాత్రం ఆదమరుపుగా ఉన్న ప్రమాదం జరగడం ఖాయం. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ లేదా సిబ్బందిని నియమించాలి

బస్ స్టేషన్ నుంచి బస్సులు బయటకు వస్తున్నప్పుడు ఇరు వైపులా వాహనాలను క్రమబద్ధీకరించేలా సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలని, ఇది సాధ్యం కాకపోతే ట్రాఫిక్ పోలీసులను లేదా.. ఆర్టీసీ సిబ్బందిని నియమించాలని స్థానికులు అంటున్నారు. ఈ సిబ్బంది ఉదయం బస్సులు బస్ స్టేషన్‌లోకి రావడం ప్రారంభించనప్పటి నుంచి రాత్రి వరకు విధుల్లో ఉండేలా చూడాలని, అప్పుడే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు అంటున్నారు.

రోడ్డుపై వాహనాల అక్రమ పార్కింగ్



బస్సులు బయటకు వస్తున్నపుడు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. బస్సులు యూ టర్న్ తీసుకొనే చోట రోడ్డుపై ఆటోలు, క్యాబ్‌లను అక్రమంగా నిలుపుతుండటంతో బస్సులను బస్ స్టాండ్ నుంచి బయటకు తీసుకొచ్చేందుకు డ్రైవర్ నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ సమయంలో ట్రాఫిక్ జామ్ అయి ఇతర వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

\- గౌతమ్, జ్యూస్ వెండర్

పరిశీలించి చర్యలు తీసుకుంటా



పోలీస్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు బస్ స్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు మీద ఏవైనా వాహనాలను, ఆటోలు నిలిపితే వెంటనే పంపిస్తున్నారు. ట్రాఫిక్ క్రేన్ సిబ్బంది కూడా తిరుగుతూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది సమన్వయంతో రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.

\- శంకర్ రాజు, ఏసీపీ, నార్త్‌జోన్ ట్రాఫిక్

బస్తీల్లో పరిష్కారం కానున్న రోడ్ల సమస్య

- రూ. 70 లక్షల వ్యయంతో నిర్మాణం
- పనులకు శంకుస్థాన చేసిన ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రసూల్‌పురాలోని సీబీఎస్ నగర్ బీరప్ప గుడి, హనుమాన్ టెంపుల్ చర్చి, అర్జున్‌నగర్ బస్తీల్లో రోడ్ల సమస్య పరిష్కారం కానుంది. ఈ బస్తీల్లో అధ్వాన రోడ్ల కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలకు ఇక చెక్ పడనుంది. నూతనంగా రోడ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రూ. 70 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్‌లు శంకుస్థాపన చేశారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని, దాంతో స్థానికులకు రోడ్ల సమస్య నుంచి విముక్తి లభిస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి, బీజేపీ నాయకులు వంశీ తిలక్, కాంగ్రెస్ నాయకులు శ్యాంసన్‌రాజు, మురళి, ఆంజనేయులు, బద్దం బల్వంత్‌రెడ్డి, తౌఫిక్, మహేష్, నాగేష్‌యాదవ్, శ్రీహరి, జహంగీర్, నయీం, యాదగిరి, అజ్జు, కిషన్, మల్లేష్, అరవింద్, రేష్మ, సౌమ్య పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఈటల, శ్రీగణేశ్, బాణుక నర్మద



బస్తీబాటలో పాల్గొన్న ఆదం సంతోష్ కుమార్ తదితరులు

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ విఫలం

● కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి సంతోష్ కుమార్

అడ్డగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో ఎమ్మెల్యే కార్పొరేటర్ విఫలమయ్యారని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. అడ్డగుట్టలో ఆదివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఏబీసీడీ సెక్షన్‌లో పర్యటించిన కాంగ్రెస్ నేతలకు స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. చాలా కాలంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం ఆదం తదితరులు అడ్డగుట్టలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. స్థానికంగా ఉన్న సమస్యల్ని వెంటనే ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గంట రాజు సాగర్, అంజయ్య యాదవ్, దొమ్మాటి శివకుమార్ పాల్గొన్నారు.



ఇందిరా పార్కు వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య తదితరులు

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు వెంటనే నిర్మించకుంటే ప్రగతి భవన్, మినిస్టర్ క్వార్టర్స్, ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు హాస్టల్ విద్యార్థులను తరలిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం అంగుళం భూమి అమ్మినా ఉపేక్షించేది లేదన్నారు. హాస్టల్, గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం, తెలంగాణ యువజన విభాగం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కృష్ణయ్య పాల్గొన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్, గురుకుల భవనాల అద్దెలు చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను అమ్మే నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రధాని మోదీకి ఫిర్యాదు చేసి పార్లమెంటులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. ధర్నాలో బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, అనంతయ్యమల్లేష్ యాదవ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనస్థీషియాలజిస్టు ఒక అదృశ్య వైద్యుడు

● సోపా అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనస్థీషియాలజిస్టు ఒక అదృశ్య వైద్యుడని సొసైటీ ఆఫ్ పీరియాపరేటివ్ ఫిజిషియన్ అనస్థీషియాలస్టు (సోపా) అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో సొసైటీ ఆఫ్ పీరియాపరేటివ్ ఫిజిషియన్ అనస్థీషియాలజిస్టు (సోపా) ఒక సైంటిఫిక్ ప్రోగ్రాం నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, భారతదేశపు మొట్టమొదటి సొసైటీ ఆఫ్ పీరి యాపరేటివ్ ఫిజిషియన్ అనస్థీషియాలజిస్టును హైదరాబాద్‌లో 120 మంది అనస్థీషియాలజిస్టులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి అనస్థీషియాలజిస్ట్ శస్త్రచికిత్సకు ముందు, తర్వాత రోగులలో రక్తపోటు, మధుమేహం, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు వంటి సాధారణ వైద్య పరిస్థితు లను నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు. న్యాయస్థానం దృష్టిలో సమర్థుడైన పెరియోపరేటివ్ వైద్యునిగా గుర్తింపుకు ప్రయ త్నించడం తమ ధ్యేయమని, సోపా సభ్యురాలు డాక్టర్ కల్యాణి పేర్కొ న్నారు. సంస్థ సెక్రటరీ డాక్టర్ రాజా నర్సింగ్ రావు ప్రారంభ వ్యాఖ్యలు చేస్తూ, అనస్థీషియాలజిస్ట్ ఒక పెరియోపరేటివ్ ఫిజిషియన్ అని, అతను శస్త్రచికిత్సకు ముందు,సమయంలో, తర్వాత రోగి సంరక్షణను నిర్వ హిస్తాడన్నారు. కార్యక్రమంలో వైద్యులు మణిమాల రావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అనస్థీషియాలజిస్టులు



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

'పేదల వైద్య సేవలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ'

మారేడుపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల వైద్య సేవలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటున్నదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 11 మంది లబ్ధిదారులకు మొత్తం ఐదున్నర లక్షల రూపాయల ఆర్థిక సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసిన దళిత బహుజన ఫ్రంట్ నాయకులు

త్యాగశీలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● డీబీఎఫ్ కార్యదర్శి పులి కల్పన

బౌద్ధనగర్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన త్యాగశీలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. సీతాఫల్ మండిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి ఆమె 15వ వారం జ్ఞానమాలను వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ, మహిళలకు సమాన హక్కుల అమలుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి హోదాలో హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టకుండా నాటి ప్రధాని మంత్రి నెహ్రూ తదితరులు అడ్డుకోవడంతో డాక్టర్ అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళా హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు పరమేశ్వరి, శారదా, తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఎంబీఏ కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్ల కౌన్సెలింగ్ మార్చి 18, 19 తేదీల్లో నిర్వహిస్తామని డా బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈనెల 9న నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్ అర్హులు, ఐ-సెట్ 2024-25లో అర్హత సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లుతో పాటు నిర్ణీత ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. వివరాల కోసం www. braouonline. in, www.braou.ac.in వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచించారు.

తుకారాంగేట్‌లో గృహిణి అదృశ్యం

అడ్డగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ భార్య స్వర్ణలత (36) కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం తుకారాంగేట్‌లో ఉంటున్న తల్లి ఇంటికి వచ్చింది. ఇలా ఉండగా, ఈనెల 15న బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన స్వర్ణలత తిరిగి రాలేదు. తల్లి పత్రిమణిబాయి వెంటనే తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వర్ణలత

అడ్డగుట్టలో వ్యక్తి..

ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన సరహా దీవన్ భర్త మహ్మద్ సఫీ షరీఫ్ (25) ఈనెల 6న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధు,మిత్రులను షరీఫ్ గురించి వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో భార్య ఆదివారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహ్మద్ సఫీ షరీఫ్